క్లుప్తంగా

ప్రమాణస్వీకారానికి రావాలని మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వానం



మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వానపత్రిక ఇస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పద్మశాలి సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారానికి ముఖ్య అతిథిగా రావాలని కోరుతూ ఆ సంఘం నాయకులు బుధవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మంత్రిని సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు బొడ్డు గోవిందరావు, గంజి శివ, నామని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ్ సైన్యం తెలంగాణ లోగో ఆవిష్కరణ..

హుజూర్‌నగర్‌కు చెందిన వారు రూపొందించిన ఉత్తమ్ సైన్యం తెలంగాణ లోగోను మంత్రి ఉత్తమ్ బుధవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ జాయింట్ సెక్రెటరీ ఎండీ అజీజ్ పాషా, ఉత్తమ్ సైన్యం తెలంగాణ వ్యవస్థాపకుడు ఈద్పుగంటి మోహన్, నాయకులు సమ్మెట సుబ్బరాజు, నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలుకూరు : మండలంలోని బేతవోలు సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం బేతవోలు ఫీడర్‌లో గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రామిశెట్టి శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అందుబాటులో యూరియా

నేరేడుచర్ల : వానాకాలం సీజన్‌లో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని హుజూర్‌నగర్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రవి తెలిపారు. బుధవారం నేరేడుచర్ల మండల కేంద్రంలోని పద్మ ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆయన పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. అధిక ధరలకు యూరియా అమ్మితే లైసెన్స్ రద్దు చేసామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఓ జావిద్, దుకాణ యాజమాని మాల్యాద్రి తదితరులు ఉన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్- 1 మ్యాథమెటిక్స్-1 తెలుగు- 1, కంప్యూటర్ సైన్స్ -1 సబ్జెక్టులు బోధించేందుకు సంబంధిత సబ్జెక్టులో పీజీ, పీహెచ్‌డీ, నెట్, సెట్ అదనపు అర్హతలతో పాటు బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఓసీ, బీసీ అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టు పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు ఉండాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్స్, జిరాక్స్ కాపీలతో జూలై 26 తేదీ సాయంత్రం గం 4.30 లోపు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

కళాశాల ఏర్పాటుకు పట్టణ శివారులో అనువైన భూములు

హుజూర్‌నగర్ : వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు హుజూర్‌నగర్ శివారులోని 1041 సర్వే నంబర్‌లో గల భూములు అనువుగా ఉన్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సర్వే నంబర్‌లో లావని పట్టా, పట్టాదారులై ఉన్న వారు ప్రభుత్వానికి సహకరించి వ్యవసాయ కళాశాల నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని ఆయన కోరారు.

సేవాలాల్ సేన మహిళా కమిటీల నియామకం



బానోతు బుజ్జిని సన్మానిస్తున్న నాయకులు

మఠంపల్లి : మండలంలోని కృష్ణాతండా, గుర్రంబోడుతండాల మధ్యలో గల శ్రీసేవాలాల్ మహరాజ్ ఆలయంలో బుధవారం సేవాలాల్ సేన సమావేశాన్ని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన మహిళా సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలిగా బానోతు బుజ్జి, మండల అధ్యక్షురాలిగా బానోతు నాగమణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నాయకులు తులిశా, చాందు, పాండు, రవి, మట్టపల్లినాయక్, మహిళలు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

మేళ్లచెరువు : చింతలపాలెం మండల కేంద్రంలో హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని ఏఎంసీ చైర్మన్ రాధిక అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ ప్రారంభించి మాట్లాడారు. నందిరెడ్డి ఇంద్రారెడ్డి, మార్కెట్ కార్యదర్శి సంతోష్, నవీన్, సైదిరెడ్డి, పశువైద్యులు శ్రీనివాసరెడ్డి, మధు, చారి, రమాకాంత్, రైతులు పాల్గొన్నారు.

జోరుగా వాన



నడిగూడెం సమీపాన నీటి మునిగిన వరి పొలాలు

- నీట మునిగిన వరి పొలాలు
- నిండిన కుంటలు, పొంగిన వాగులు

నడిగూడెం : మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామున జోరు వాన పడింది. దీంతో మండలంలోని పలు వాగులు పొంగిపొర్లాయి. చెరువుల్లోకి భారీగా నీరు వచ్చి చేరింది. పాత చాకిరాల వెంట ఉన్న కల్వర్టు మీదుగా వరద నీరు పారింది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. నడిగూడెం, చాకిరాల, రత్నవరం, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట గ్రామాల్లో బోర్లు, బావుల కింద సాగు చేసిన వరి పొలాలు నీట మునిగాయి. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి వెద జల్లే పద్ధతిలో వరి సాగు చేపట్టామని, పొలాలు పెరిగే సమయంలో భారీ వర్షానికి నీట మునిగాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా నడిగూడెంకు చెందిన రమణారెడ్డికి చెందిన నాలుగు వ్యవసాయ మోటార్లు నీట మునిగాయి. కాగితరామచంద్రాపురంలో డ్రెయినేజీలు లేకపోవడం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వీధుల్లో మెటీరియల్ అడ్డుగా ఉండడంతో ఇళ్లల్లోకి నీరు చేరింది. ప్రజలు అవస్థలు పడ్డారు. కాగా, ఈ సీజన్‌లో మండలంలో ఇదే భారీ వర్షంగా నమోదైంది.



కాగితరామచంద్రాపురంలో ఇంట్లోకి చేరిన వాననీరు

మోతె మండలంలో..

మోతె : మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లోని కుంటలు, చెరువుల్లో నీరు వచ్చి చేరింది. వాగులు పొంగాయి. కాగా పత్తి, వేరుశనగ, పెసర, కంది పంటలకు ఈ వర్షం చాలా మేలు చేసిందని రైతులు అంటున్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



కోదాడ : తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

కోదాడ : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అన్ని క్యాడర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బడుగుల సైదులు, పాండురంగాచారి, రామ నర్సయ్య, మార్కెండేయ, మైసయ్య, శ్రీనివాసరావు, ఖాజామియా, జానకిరామ్, వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం

మోతె : విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తున్నట్లు డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పబ్బంతి వెంకటేశ్వర్లు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మోతె మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకన్నకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, సీనయ్య, పరమేష్, డి.నరేందర్, వీరాంజనేయులు, సాయిశ్యాం, వెంకన్న, యాదయ్య, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లిలో తహసీల్దార్‌కు వినతి

గరిడేపల్లి : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో పోరాడుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె. బాలసైదిరెడ్డి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కవితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి, కోశాధికారి కిషోర్‌బాబు, నాయకులు పిట్ట వీరస్వామి, కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరులో..

చిలుకూరు : ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో చిలుకూరు తహసీల్దార్ ధృవకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, స్కావెంజర్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆడిట్ సభ్యులు జనార్దన్, జీహెచ్‌ఎం గుజ్జుల నరసింహారెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి కై లాసం వెంకటేశ్వర్లు, టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బచ్చయ్య, వీరస్వామి, చందా శ్రీను, కాసాని సత్యం, ఉపేందర్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెంలో..

నడిగూడెం : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు బుధవారం నడిగూడెం తహసీల్దార్ వి.సరితకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు పోలూరి శ్రీనివాసరెడ్డి, వీఎల్‌ఎన్.చారి, ఎండి.మౌలానా, శ్రీధర్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ డీఈకి వినతి

హుజూర్‌నగర్ : తమ గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని మండలంలోని మర్రిగూడెం గ్రామ ప్రజలు కోరారు. ఈమేరకు బుధవారం హుజూర్‌నగర్‌లో విద్యుత్ డీఈ వెంకటకిష్టయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బూరుగడ్డ, మాచవరం, కరక్కాయలగూడెం గ్రామాల్లో వ్యవసాయ మోటార్లు ఎక్కువ ఉన్నందున మర్రిగూడెం గ్రామంలో కరెంటు సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఎస్‌డీ అస్మతుల్లా, కడెం వీరస్వామి, అల్లాబక్షు, ఎం.వేణుగోపాల్, జి.శ్రీనివాస్, ఆదయ్య, మల్లేష్, వాసవి, మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'మహాలక్ష్మి' సంబరాలు



విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

కోదాడ : మహిళకు ఉచిత ప్రయాణం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ఎంతో ఉపయోగపడుతోందని కోదాడ ఎంవీఐ ఎస్‌కె. జిలానీ అన్నారు. బుధవారం కోదాడ ఆర్టీసీ డిపోలో నిర్వహించిన మహలక్ష్మి సంబరాల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు మహిళా ప్రయాణికులను, విద్యార్థులను సన్మానించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కోదాడ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ నాగశ్రీ, గ్యారేజ్ ఇన్‌చార్జ్ ఎంపీసీ రావు, ఏఎస్‌ఐ రాజా, ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మాస కల్యాణం



మేళ్లచెరువులో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మాసకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యావచనము, మహన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మహాలింగార్చన, పుష్పార్చన చేశారు. కార్యక్రమంలో ఈఓ శంభిరెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయ శర్మ, శాగంరెడ్డి శంభిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత చేప పిల్లలకు బదులు నగదు జమ చేయాలి

హుజూర్‌నగర్ : ప్రతి మత్స్య సొసైటీకి జల వనరులకు సరిపడేంత ఉచిత చేప, రొయ్య పిల్లలకు బదులు ఆ సంఘం ఖాతాలో నగదు జమ చేయాలని తెలంగాణ మత్స్యకారుల, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని అమరవీరుల భవనంలో నిర్వహించిన ఆ సంఘం జిల్లా మహాసభలో ఆయన మాటాడ్లారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలం శ్రీను మాట్లాడుతూ.. హుజూర్‌నగర్‌లో ఒక ఎకరం స్థలంలో రూ.5 కోట్లతో ఆధునాతన సౌకర్యాలతో హోల్ సేల్ చేపల మార్కెట్, మండల కేంద్రంలో మత్స్యకారులకు ఎకరం స్థలం, రూ.2 కోట్లు కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. సంఘం నాయకులు పి.హుస్సేన్, జి.నాగమణి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో నాయకులు పల్లె వెంకటరెడ్డి, చిరుమల్ల భిక్షం, టి.వెంకటచంద్ర, త్రివేణి, పి.నాగేశ్వరరావు, మల్లయ్య, తిరుపయ్య, యశోద, కనకమ్మ, నరసింహారావు, బాల సైదులు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విచారణ పేరుతో చితకబాదడం సరికాదు

నేరేడుచర్ల : సివిల్ మ్యాటర్‌లో జోక్యం చేసుకొని విచారణ పేరుతో స్టేషన్‌కు తీసుకువచ్చి చితకబాదడం సరికాదని బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త నర్సింహారెడ్డి అన్నారు. పోలీసుల చేతిలో దెబ్బలు తిన్న బాధితులు సంకలమద్ది శ్రీనయ్య యాదవ్, అతని భార్య కోళమ్మ, కుమారుడు నవీన్ యాదవ్‌ను ఆయన పరామర్శించారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమాయకులపై విచక్షణరహితంగా దాడి చేసిన నేరేడుచర్ల ఎస్‌ఐని సస్పెండ్ చేయడంతో పాటు అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని కల్లూరు గ్రామంలో 66 సర్వే నంబర్‌లో గత 35 ఏళ్లుగా సేద్యం చేసుకుంటున్న పేద రైతు కుటుంబంపై కబ్జాకోరులైన కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు కన్నేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, నాయకులు చెన్నబోయిన సైదులు, చిత్తలూరి సైదులు, యల్లబోయిన లింగయ్య, నవీన్‌కుమార్, నాగరాజు, సుదర్శన్, భరత్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించేవరకు విధుల బహిష్కరణ

చిలుకూరు : తమకు పెండింగ్ వేతనాలు చెల్లించేవరకు విధులు బహిష్కరిస్తున్నట్లు మండల పరిషత్ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్లు తెలిపారు. ఈమేరకు బుధవారం చిలుకూరు ఎంపీడీఓ గిరిబాబు, ఎంపీఓ ముక్కపాటి నరసింహారావు, సూపరింటెండెంట్ ప్రతాప్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్లు సందీప్, శేషు, మంగమ్మ పాల్గొన్నారు.

250 కాటన్ల నకిలీ మద్యం స్వాధీనం

మేళ్లచెరువు: మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల్లో నకిలీ మద్యం తయారు చేస్తున్న స్థావరాలపై ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బుధవారం దాడి చేయగా.. సుమారు 250 కాటన్ల నకిలీ మద్యం దొరికినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. హుజూర్‌నగర్ ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దొండపాడు వైన్స్ షాపులో పనిచేసే ప్రవీణ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా.. మేళ్లచెరువు మండలం రామాపురం గ్రామంలో రంగిశెట్టి సైదేశ్వరరావు, కొట్టె నాగసైదేశ్వరరావు తమ పొలాల్లో జేసీబీ సహాయంతో గుంత తవ్వి నకిలీ మద్యం పూడ్చిపెట్టినట్లు తెలిపాడు. పూడ్చిపెట్టిన 250 కాటన్ల నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకొని హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ పేర్కొన్నారు. జేసీబీ డ్రైవర్ గురవయ్య, ట్రాక్టర్ డ్రైవర్ వీరభద్రరావును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


- ఒకరికి తీవ్ర గాయాలు

మేళ్లచెరువు: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన బుధవారం చింతలపాలెం మండలం దొండపాడు గ్రామ శివారులో జరిగింది. వివరాలు.. మేళ్లచెరువు మండలం రేవూరు గ్రామానికి చెందిన కందుకూరి కోటేష్ సుతారీ మేస్త్రీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం పని నిమిత్తం బైక్‌పై చింతలపాలెం మండలం దొండపాడుకు వచ్చి వెళ్తుండగా.. గ్రామ శివారులో ఏపీలోని జగ్గయ్యపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కోటేష్ కుడి కాలికి తీవ్ర గాయమైంది. 108 వాహనంలో అతడిని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి బావ ఆరెగెల మోష పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు చింతలపాలెం ఎస్‌ఐ సందీప్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పత్తి చేను ధ్వంసం చేసిన వ్యక్తులపై ఫిర్యాదు

మోతె : పత్తి చేనును ట్రాక్టర్‌తో దున్ని ధ్వంసం చేశారు. ఈ ఘటన మోతె మండలంలోని బుర్కచర్ల గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాలు.. బుర్కచర్ల గ్రామానికి చెందిన నకిరకంటి సాయిలు.. తన పెద్దనాన్న నకిరకంటి రాములు వద్ద 2021లో 13 గుంటల భూమి కొనుగోలు చేసి పట్టా చేసుకున్నాడు. ప్రస్తుతం ఆ భూమిలో పత్తి పంట సాగు చేశాడు. ఈభూమి విషయమై ఇరు కుటుంబాల మధ్య వివాదం కొనసాగుతోంది. దీంతో నకిరకంటి సాయిలు సాగు చేసిన 45 రోజుల పత్తి చేనును మంగళవారం నకిరకంటి రాములు కుమారుడు నకిరకంటి రాజయ్య, నకిరకంటి నాగరాజు ట్రాక్టర్‌తో దున్ని ధ్వంసం చేశాడని ఆరోపిస్తూ బుధవారం వారిపై నకిరకంటి సాయిలు భార్య రేణుక మోతె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.. ఎన్‌ఆర్‌ఐలు సహకరించారు



స్థలం పత్రాలను అందజేస్తున్న దాతల కుటుంబసభ్యులు, గ్రామస్తులు

మునగాల : మండలంలోని బరాఖాత్‌గూడెంలో అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరై ఆరు నెలలు గడుస్తున్నా నిర్మించేందుకు అనుకూలమైన స్థలం లేదు. ఇటీవల గ్రామంలో ఎమ్మెల్యే పద్మావతి పర్యటించినప్పుడు సమస్యను గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే స్థలం దానం చేసేందుకు ఎన్‌ఆర్‌ఐలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పిలుపు మేరకు రిటైర్డు హెచ్‌ఎం జెట్టి వీరారెడ్డి చొరవతో అమెరికాలో నివసిస్తున్న ఎన్‌ఆర్‌ఐలు ఏనుగుల వెంకటేశ్వరరావు, జెట్టి ప్రశాంత్‌రెడ్డి, గడ్డం మధుకర్‌రెడ్డి, ముదిరెడ్డి మధుకర్‌రెడ్డి, ముదిరెడ్డి సత్యనారాయణరెడ్డి, వెలిగేటి కరుణాకర్, గుండు చంద్రకిరణ్, గోర్లముడి శ్రీనివాసరావు, జెట్టి రోహిత్‌రెడ్డి రూ.6లక్షలు అందించారు. ఆ డబ్బులతో భవనం నిర్మించేందుకు 160 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి ఆ పత్రాలను ఎంపీడీఓ రమేష్‌దీన్‌దయాల్ చేతుల మీదుగా సీడీపీఓ పారిజాతంకు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి శ్వేత, జెట్టి రాంరెడ్డి, జెట్టి వీరారెడ్డి, రుక్మారావు, పూర్ణ శంకర్‌రావు, సుమన్, రవి ఉన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

నేరేడుచర్ల : మండలంలోని పుల్లంబండ తండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం ల యన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్, పెన్సిళ్లు పంపిణీ చేశారు. గుండ్రెడ్డి సైదిరెడ్డి, విశ్వనాథం, సూరిబాబు, ఆదిరెడ్డి, హెచ్‌ఎం శ్రీధర్, వరప్రసాద్ ఉన్నారు.

బాలికలు బలహీనులమని భావించొద్దు

- సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్

హుజూర్‌నగర్ : బాలికలు బలహీనులమని భావించవద్దని, మానసికంగా, శారీరకంగా బలవంతులమనే భావన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్ తెలిపారు. బుధవారం పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. తమ పట్ల ఎవరైన అనుచితంగా ప్రవర్తిస్తే వారిని ధైర్యంగా ప్రతిఘటించడంతో పాటు ఆ విషయాన్ని వెంటనే కుటుంబ పెద్దలకు తెలపాలని చెప్పారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ మాట్లాడుతూ.. లింగ వివక్ష నేరమని అన్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా సరీన మాట్లాడుతూ.. బాలికలకు ఉచిత విద్య రాజ్యాంగం కల్పించిన హక్కు అని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు, ఏజీపీ బానోతు సురేష్ కుమార్, కోశాధికారి ఉప్పల గోపాలకృష్ణమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ రెహానా బేగం, న్యాయవాదులు సైదా హుస్సేన్, ఉదారి యాదగిరి, బుడిగ నరేష్, న్యాయ, పోలీస్, సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విషజ్వరాలపై అప్రమత్తత అవసరం

- అదనపు కలెక్టర్ రాంబాబు



మునగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

మునగాల : విష జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో నిరంతరం పర్యటించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. అనంతరం బాలాజీ రైస్ మిల్‌ను తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా మిల్లు యాజమాన్యం 32 ఏసీకేబియ్యం పెండింగ్‌లో ఉన్నందున ఈ నెల 25 లోపు ఇవ్వాలని ఆదేశించారు. ఆయన వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రవీందర్, వైద్య సిబ్బంది, ఆర్ఐ రామారావు, తదితరులు ఉన్నారు.

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం



మేళ్లచెరువులో మెయిన్‌రోడ్డుపై నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

హుజూర్‌నగర్ : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ హుజూర్‌నగర్‌లో ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు ఇందిరాల నరేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, కాలేజీలు బంద్ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని, పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు గొబ్బి రాము, రామాల అనిల్, ఎన్ శంకర్, ప్రేమ్ కుమార్, సాయి, రవి, అనిల్ కిరణ్, సాయి పాల్గొన్నారు.

కోదాడరూరల్ : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన విద్యా సంస్థల బంద్ కోదాడలో విజయవంతమైంది. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు చేపూరి కొండలు, ధరావత్ రవి, తమ్మన బోయిన నరేష్, పులి రాఖి, విష్ణు, వికాస్, చరణ్, అజయ్, చందుకుమార్ తదితరులు ఉన్నారు.

గరిడేపల్లి : విద్యా సంస్థల బంద్ గరిడేపల్లి మండలంలో విజయవంతమైంది. ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పంగ సైదులు, మెండే లింగరాజు, యామరావు వినోద్, షేక్ ఖాసీం, నవీన్, నాగరాజు, రమేష్, నందిపాటి సతీష్, మెండే నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో బుధవారం విద్యా సంస్థలను బంద్ చేశారు. విద్యార్థి సంఘం నాయకుడు పాలంపల్లి వేణు, గుండు వంశీ, జక్కుల వినయ్, నర్సింగ్ అనిల్, నవీన్, వినోద్ పాల్గొన్నారు.

మునగాల : విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ మునగాల మండలంలో విజయవంతమైంది. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు బచ్చలకూర ప్రశాంత్, సృజిత్, ప్రవీణ్, విష్ణు, సాయి తదితరులు ఉన్నారు.

నేరేడుచర్ల : ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని నియంత్రించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నేరేడుచర్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు పలు విద్యా సంస్థలను మూసివేయించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, కొమర్రాజు వెంకట్, భరత్ తదితరులు ఉన్నారు.

మేళ్లచెరువు : మండలంలోని ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలను ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం బంద్ చేయించారు. విద్యారంగంపై ప్రభుత్వ వైఖరీని ఖండిస్తూ మేళ్లచెరువులో ప్రధాన రహదారిపై ఆ సంఘం నాయకులు.. విద్యార్థులతో కలిసి నిరసన తెలిపి మాట్లాడారు.ఎం. అశోక్, ఆదినారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మునగాల : పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణారెడ్డి

మునగాల : యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని మునగాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాన్ఫిడెంట్ బిల్డింగ్, మంచి అలవాట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతపై పెద్దలకు వివరించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ బూర సైదయ్య గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానసిక ధైర్యాన్ని కోల్పోవద్దు

మఠంపల్లి : అసాధారణ పరిస్థితుల్లో మహిళలు, బాలికలు మానసిక ధైర్యాన్ని కోల్పోవద్దని హుజూర్‌నగర్ సీఐ గజ్జె చరమందరాజు అన్నారు. బుధవారం రాత్రి మఠంపల్లి మండలంలోని బక్కమంతులగూడెం సమీపంలో గల కస్తూరిబా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ సెహగల్ జీవితం ఆదర్శనీయం



మునగాల : జగన్నాథపురంలో లక్ష్మీ సెహగల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా సభ్యులు

గరిడేపల్లి : సంఘ సేవకురాలు కెప్టెన్ లక్ష్మీ సెహగల్ జీవితం ఆదర్శనీయమని ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు సుందరి రమాదేవి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో గల సుందరి భిక్షమయ్య భవన్‌లో కెప్టెన్ లక్ష్మీ సెహగల్ 12వ వర్ధంతిని ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో భూతం సరిత, ఎల్లావుల పిచ్చమ్మ, గుండు నాగమణి, ఎగ్గడి విజయ, బంగారు జ్యోతి, బండారు వీరనాగ, జుట్టుకొండ సక్కుబాయమ్మ, ధారావతు నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కెప్టెన్ లక్ష్మీ సెహగల్‌కు నివాళి

మునగాల : మండలంలోని జగన్నాథపురంలో కెప్టెన్ లక్ష్మి సెహగల్ 12వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు షేక్.ఖాజాబీ, మండల మహిళా కమిటీ సభ్యురాలు వెంపటి మైసమ్మ, బొల్లం శ్రీదేవి, గొడ్డి సుభద్ర, దైద జ్యోతి, షేక్ చాందిని, వీరమ్మ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

మునగాల : త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నకల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని బీజేపీ మండల అధ్యక్షుడు మైలార్‌శెట్టి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ప్రభారీలు జిల్లా జనార్దన్‌రావు, నాగేంద్రచారి, కృష్ణప్రసాద్, వెంకటేష్‌బాబు, పురుషోత్తం, గోవిందాచారి, వినోథ్, తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని బీజేపీ రూరల్ మండల ఎన్నికల ప్రభారి దేనుమకొండ రామరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని బీజేపీ రూరల్ మండల కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. రూరల్ మండల జెడ్పీటీసీ ఎన్నికల ప్రభారి సీహెచ్.సోమయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉమామహేశ్వరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కె.కోటిరెడ్డి,ఎం.లక్ష్మీనారాయణ, ఎ.భిక్షమయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి

నేరేడుచర్ల : గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రభారిలు పాకల వెంకటేశ్వర్లు, కొత్తూరు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నేరేడుచర్లలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు చింతకుంట్ల రాజేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. వెంకటేశ్వర్లు, చింతకుంట్ల సోమిరెడ్డి, పార్థనబోయిన విజయ్‌కుమార్, వీరబాబు, విజయ్‌రెడ్డి, జగతయ్య ఉన్నారు.